తెలుగు రాష్ట్రాల కరాటే పోటీల్లో ఉమ్మడి జిల్లాకు ప్రథమస్థానం 7

భీమేశ్వరాలయంలో శరన్నవరాత్రి ఉత్సవ ఏర్పాట్లకు రాటముహూర్తం 7

కొత్త ఎస్పీ బాధ్యతల స్వీకరణ

అమలాపురం,సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాఎస్పీగా రాహుల్‌మీనా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అమలాపురం నల్లవంతెన రోడ్డులోఉన్న ఎస్పీ కార్యాలయంలో తొలుత పోలీసులు ఆయనకు గౌరవంగా స్వాగతంపలికారు. అనంతరం ఎస్పీ కార్యాలయంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ఎస్పీగా రాహుల్‌మీనా బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు జిల్లా అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీప్రసాద్ పుష్పగుచ్ఛం అందించి సాదరంగా స్వాగతం పలికారు. డీఎస్పీలు టీఎస్‌ఆర్కే ప్రసాద్, సుంకర మురళీమోహన్, వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సీఐలు, ఎస్‌ఐలు మర్యాదపూర్వకంగా ఎస్పీని కలిశారు. బాధ్యతల స్వీకరణ అనంతరం అయినవిల్లిలోని వినాయక ఆలయంలో ఎస్పీప్రత్యేక పూజలు నిర్వహించారు. రాహుల్‌మీనా అనంతపురం జిల్లా గుంతకల్లు రైల్వే ఎస్పీగా పనిచేస్తూ కోనసీమకు బదిలీ అయ్యారు. ఇప్పటివరకు ఇక్కడ ఎస్పీగా పనిచేసిన బి.కృష్ణారావు పల్నాడు జిల్లాకు ఎస్పీగా బదిలీ అయి వెళ్లారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్పీ రాహుల్‌మీనా

నేటి నుంచి జిల్లా కలెక్టర్ల సదస్సు

» పయనమైన జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరుపై అధ్యయనం చేసేందుకు అమరావతిలో సోమవారం నుంచి రెండురోజులపాటు కలెక్టర్లు, ఎస్పీల కాన్ఫరెన్స్ జరగనుంది. దీనిలోభాగంగా సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగే కలెక్టర్ల కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ మహేష్‌కుమార్ అమరావతికి పయనమైనట్టు సమాచారం. దీనిలోభాగంగా మొదటిరోజు జీఎస్డీపీ అంశంపై ప్రజెంటేషన్, సేవల రంగం, పరిశ్రమలు, వ్యవసాయం, పర్యాటకం తదితర రంగాల పురోగతిపై సమీక్ష, సంక్షేమం, సూపర్-6, అన్నక్యాంటీన్లు, పీ-4 అంశంపై సమీక్షతోపాటు వివిధ కీలక అంశాలపై ప్రభుత్వం సమీక్ష నిర్వహించనుంది. రెండోరోజు మానవవనరుల అభివృద్ధి, వైద్యఆరోగ్యం, విద్య, స్కిల్ డెవలెప్మెంట్, ఆధునిక, సాంకేతిక రంగాలు, క్వాంటమ్ వ్యాలీ, వాట్సాప్‌లో పౌరసేవలు, రెవెన్యూ అంశాలు, ఎక్సైజ్, వాణిజ్యపన్నులు, మైనింగ్ ట్రాన్స్‌పోర్టుతోపాటు శాంతి భద్రతల సమస్యపైనా సీఎం చంద్రబాబు రెండు రోజుల సమీక్షలో చర్చించనున్నారు.

17న స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్

» 17 నుంచి వచ్చేనెల 2 వరకు ఆరోగ్య శిబిరాలు

ముమ్మిడివరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి మోదీ 75వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 17న నరేంద్రమోదీ స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు జిల్లావైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర తెలిపారు.ఈనెల 17 నుంచి వచ్చేనెల 2వతేదీ గాంధీ జయంతి వరకు ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.జిల్లావ్యాప్తంగా మహిళలు, ఆడపిల్లలకు ఆరోగ్య సంరక్షణ సేవలను బలోపేతం చేస్తూ నాణ్యమైన సంరక్షణకోసం ఆరోగ్య శిబిరాలను నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. మహిళలు ఆరోగ్యవంతంగా ఉంటే ఆయా కుటుంబాలు బలోపేతం అవుతాయనే లక్ష్యంతో కేంద్రం ఈ వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ శిబిరాలు మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణ, అవసరాలు తీర్చడానికి ప్రత్యేకంగా రూపొందించి ముఖ్యమైన సేవలు అందిస్తారన్నారు. అన్ని ప్రైవేటు ఆస్పత్రులు ఆరోగ్య సంరక్షణ వాటాదారులు ముందుకువచ్చి ఈ జన భాగీదారి అభియాన్‌లో అంతర్భాగం కావాలన్నారు. కార్యక్రమాల్లో అన్నిరకాల వ్యాధులకు వైద్య పరీక్షలు చేసి చికిత్సలు అందించడంతోపాటు పర్సనల్ హైజీన్ కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. ప్రతిఒక్కరూ ఆధార్‌కార్డు, హెల్త్, ఆయుష్మాన్ భారత్ కార్డులతో హాజరుకావాలని సూచించారు. ఇప్పటికే ఆధార్‌ఐ డీ నమోదు ప్రక్రియ దాదాపుగా పూర్తయిందని, త్వరలో హెల్త్ ప్రొఫైల్ ఆన్‌లైన్‌లో వస్తుందని, ఆ ప్రకారం వైద్యసేవలను మరింత సులభతరం అందించే వెసులుబాటు త్వరలో రానుందన్నారు. ప్రతి నియోజకవర్గంలో రోజువారీగా ఆరోగ్యశిబిరాలు ఉంటాయన్నారు. రక్తదాన శిబిరాలు కూడా నిర్వహిస్తారన్నారు. ఆడబిడ్డ పుట్టిన నాటినుంచి సంరక్షణ సేవలు బలోపేతం చేస్తూ శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అర్హుల అన్వేషణ.. మొదలు



» ఆటో కార్మికుల కోసం జీవో నెంబరు 33 విడుదల
» జిల్లాలో 17,968మంది లబ్ధిదారుల అంచనా
» రూ.27కోట్ల మేర నిధుల పంపిణీకి రంగం సిద్ధం
» మార్గదర్శకాలతో ప్రభుత్వ ఉత్తర్వులు జారీ
» అర్హులైన అందరికీ ప్రభుత్వ సాయం: డీటీవో శ్రీనివాస్

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ఆటో కార్మికులకు విజయదశమి పర్వదినం రోజు నుంచి ఏడాదికి రూ.15వేల చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నట్టు సీఎం చంద్రబాబు చేసిన ప్రకటన నేపథ్యంలో ట్రాన్స్‌పోర్టు అధికారులు అర్హులైన ఆటోకార్మికుల ఎంపికపై దృష్టిసారించారు. రాష్ట్రప్రభుత్వం ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలతో కూడిన జీవో నెంబరు 33ను శనివారం విడుదల చేసింది. దీనిలోభాగంగా అర్హులైన ఆటోకార్మికులు ప్రభుత్వ సాయం పొందేందుకు తమ దరఖాస్తులను సచివాలయాల ద్వారా రవాణాశాఖకు పంపించాల్సి ఉంది. ట్రాన్స్‌పోర్టు అధికారులు అర్హుల ఎంపికకు చర్యలు చేపట్టారు.

ప్రభుత్వం స్త్రీశక్తి పథకం ద్వారా మహిళల కోసం ఉచిత బస్సు సౌకర్యం అమలు చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆటోకార్మికుల జీవనోపాధిపై దీనిప్రభావం చూపుతోంది. దీంతో వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం విజయదశమి నుంచి ఒక్కొక్క ఆటోడ్రైవర్ కుటుంబానికి ఏడాదికి రూ.15వేల చొప్పున ఆర్థిక సహాయం అందించడానికి హామీ ఇచ్చింది. దీనిలోభాగంగా ప్రభుత్వం అందించే నిధులతో ఆటోలకు బీమా, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, మరమ్మతులు, ఇతర అవసరాలకోసం స్వీయ యాజమాన్యంలోని ఆటోకార్మికులకు ఈ సహాయం అందించనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం కొన్ని మార్గదర్శకాలతో కూడిన జీవోనెంబరు 33ను విడుదల చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో స్వీయ యాజమాన్యంలోని ఆటోరిక్షా, మోటారుక్యాబ్, మ్యాక్సీ క్యాబ్‌డ్రైవర్లకు ఈ సహాయం అందనుంది. అర్హత, దరఖాస్తు, ధ్రువీకరణకోసం మార్గదర్శకాలను విడుదల చేసింది. రవాణాశాఖ, రోడ్లు, భవనాలశాఖ విభాగానికి చెందిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆటో కార్మికులు తమ అర్హతలను నిరూపించుకునేందుకు రవాణాశాఖ కార్యాలయానికి క్యూ కడుతున్నారు.

ఆటో, మ్యాక్స్, క్యాబ్‌ల కార్మికులకు..

అక్టోబరు 2న రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు అందించే సహాయానికి సంబంధించి అర్హులైన లబ్ధిదారుల అన్వేషణలో నిమగ్నమయ్యారు. దీనిలోభాగంగా జిల్లాలో 14,655 ప్యాసింజర్ ఆటోలు ఉన్నాయి. మోటారుక్యాబ్‌లు 2598, మ్యాక్సీ క్యాబ్‌లు 715 ఉన్నాయి. ప్రస్తుతం వీరిలో ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అర్హులైన వారికి రాష్ట్ర ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం కార్మిక కుటుంబాలకు అందుతుందని జిల్లా రవాణాశాఖ అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. గతంలో 2023-24కు అప్పటి వైసీపీ ప్రభుత్వం వాహనమిత్ర పథకం ద్వారా ఆటో కార్మికుల కుటుంబానికి రూ.10వేల వంతున 7520మంది కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించారు. ప్రస్తుతం ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం కోసం అర్హతలతో దరఖాస్తు చేసుకునే వారికి ఈ సహాయం అందుతుందని, సాంకేతికపరమైన ఇబ్బందులు ఉంటే వాటిని పరిష్కరించి అందరికీ అందేలా చర్యలు తీసుకుంటామని డీటీవో శ్రీనివాస్ తెలిపారు.

రెడీఎస్సీ!

నేడే ఉపాధ్యాయ అభ్యర్థుల తుది జాబితా విడుదల



» మొత్తం 1241 పోస్టులు
» 16,17న వెబ్ ఆప్షన్లు స్వీకరణ
» 19న ఉత్తర్వులు విడుదల
» 20,21న జాయినింగ్

(కాకినాడ/రూరల్-ఆంధ్రజ్యోతి)

ఉపాధ్యాయ ఉద్యోగాలకు సంబంధించిన అభ్యర్థుల ఎంపిక తుది జాబితా సిద్ధమైంది. ఇప్పటికే ఎంపికైన డీఎస్సీ అభ్యర్థుల వివరాలు వెల్లడించి వారి ధ్రువపత్రాల పరిశీలన చేపట్టారు. తుది జాబితాలను సోమవారం సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయం, మెగా డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ https://apdsc.apcfss.in/లో అందుబాటులో ఉంచనున్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన మెగా డీఎస్సీ-2025 రిక్రూట్‌మెంట్ ముగింపు దశకు చేరుకుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 1241 పోస్టులు ఉన్నాయి. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండ లం చేబ్రోలు ఆదర్శ ఇంజినీరింగ్ కళాశాలలో గత నెల 28 నుంచి ఈ నెల 13వ తేదీ వరకు ఏడు విడతల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించారు. అందుబాటులో ఉన్న ఖాళీలకు పోస్టింగ్స్ కేటాయింపుపై 16,17 తేదీల్లో వెబ్ ఆప్షన్ స్వీకరించి 19న ఉత్తర్వులు జారీ చేస్తారు. నియామకపత్రాలు పొందిన కొత్త టీచర్లు వారికి కేటాయించిన పాఠశాలల్లో 20,21 తేదీల్లో రిపోర్టు చేయాల్సి ఉంది. 22 లేదా 23 నుంచి దసరా సెలవుల్లో శిక్షణ ఉంటుంది.శిక్షణ బృందాలను సిద్ధం చేశారు.

పోస్టులు ఇవీ..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా డీఎస్సీలో 1241 పోస్టులు ఉండగా 63,004 దరఖాస్తులు వచ్చాయి.38,617 మంది పరీక్షలు రాశారు. స్కూల్ అసిస్టెంట్ 608, పీఈటీలు 210, ఎస్జీటీ 423 పోస్టులు ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు తెలుగు 65, హిందీ 78, ఇంగ్లీష్ 95, గణితం 64, ఫిజికల్ సైన్స్ 71, బయోలాజికల్ సైన్స్ 103, సోషల్ 132, వ్యాయామ విద్య 210 ఉద్యోగాలతో పాటు సెకండరీ గ్రేడ్ టీచర్ల ఉద్యోగాలు ఉన్నాయి. ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమానికి సంబంధించి ఫిజికల్ సైన్స్ 3, బయోలాజికల్ సైన్స్ 4, స్కూల్ అసిస్టెంట్ వ్యాయామ విద్య 1, ఎస్జీటీలు 104 మొత్తం 112 ఉద్యోగాలు భర్తీ చేయనున్నారు. ప్రత్యేక విద్యకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా 13 టీజీటీలు, మూడు పీఈటీలు, 15 ఎస్జీటీలతో కలిపి 31 పోస్టులు ఉన్నాయి. జోన్ 2 (ఉమ్మడి తూర్పు, పశ్చిమ, కృష్ణా)కు సంబంధించిఏపీఆర్ఎస్,ఏపీఎంఎస్, ఏపీఎస్‌డబ్ల్యూ, బీసీ, సోషల్ వెల్ఫేర్‌కు సంబంధించి పీజీటీ 49, టీజీటీ 272, పీడీ 3, పీఈటీ 24తో కలిపి మొత్తం 348 పోస్టులు భర్తీ చేయనున్నారు.



ప్రిన్సిపాల్ కమిషనర్ సీజీఎస్టీ, కస్టమ్స్ నీలం శ్రీధర్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఏసీ ప్రసాద్

అంతర్వేది ఆలయంలో కస్టమ్స్ కమిషనర్ పూజలు

అంతర్వేది, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి విశాఖపట్నం ప్రిన్సిపాల్ కమిషనర్, సీజీఎస్టీ, కస్టమ్స్ నీలం శ్రీధర్ ఆదివారం విచ్చేశారు. వారికి ఆలయ అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. వేద పండితులచే వేదాశీర్వచనం జరిపించారు. అనంతరం ఆయనకు ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు.

ఖతర్ నుంచి సురక్షితంగా వచ్చిన కోనసీమ మహిళ 7

ఆక్వా చెరువుల వద్ద విద్యుదాఘాతం
» అల్లవరంలో వ్యక్తి మృతి 7

పంట కాలువలో పడి వృద్ధురాలి మృతి

పరిహారం ఇవ్వకుండానే.. నిర్మాణాలా?



అలమూరు మండలం పెదపళ్ల పరిధిలో రైతుల నుంచి సేకరించిన భూమిలో కట్టడాలు చేస్తున్న ఓఎన్జీసీ

ఆలమూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రైతులనుంచి ఓఎన్‌జీసీ అధికారులు కొంత భూమి తీసుకున్నారు.. ఆరునెలలలోపు పరిహారం చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకుంటామన్నారు. కానీ, చెల్లించకుండానే నిర్మాణాలు మొదలుపెట్టారు.

ఆలమూరు మండలం పెదపళ్లలో ఓఎన్జీసీ కార్యకలాపాలు విస్తరించేందుకు స్థానిక రైతుల నుంచి కొంత భూమి కొనుగోలు చేయడానికి సంస్థ ఒప్పందం చేసుకుంది. మండపేట పరిసరాల్లో వివిధ బావుల నుంచి గ్యాస్, చమురు సేకరించే నిమిత్తం మూడున్నర దశాబ్దాల క్రితమే ఇక్కడ జీసీఎస్‌ను ప్రారంభించారు. ఇటీవల కాలంలో ప్లాంట్ విస్తరించడంలో భాగంగా రైతుల నుంచి భూమిని కొనుగోలు చేయాలని భావించి జీసీఎస్ పక్కనేఉన్న ఆలమూరు మండలం పెదపళ్లలో 14మంది రైతుల నుంచి 15.52 ఎకరాల భూమిని కొనుగోలు చేయడానికి ఓఎన్జీసీ గతేడాది అక్టోబరులో ఒప్పందం కుదుర్చుకుంది. ఆరునెలల లోపులో రిజిస్ట్రేషన్ చేయించుకుని రైతులకు చెల్లించాల్సిన మొత్తాన్ని అందించేందుకు ఆ ఒప్పందంలో ఉంది.

రిజిస్ట్రేషన్ కాకుండా నిర్మాణాలు

రైతులవద్ద దశాబ్ద కాలం క్రితమే లీజుకు తీసుకుని తమకు శాశ్వతంగా కొనుగోలు చేసుకుంటామని ఓఎన్జీసీ రైతులకు సూచించింది. ఈ ప్రతిపాదనకు రైతులు ఒప్పుకుని అమ్మకాలు చేయడానికి అంగీకరించారు. దీంతో గతేడాది అక్టోబరులో ఒప్పందం చేసుకుని రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి నిర్ణయం జరిగింది. కానీ, ఇది జరగకుండానే చుట్టూ ప్రహరీ నిర్మాణంతోపాటు ప్లాంటుకు సంబంధించి శాశ్వత నిర్మాణాలు మొదలుపెట్టారు. తాము అమ్మకం చేయకుండానే నిర్మాణాలు ఎలా చేపడతారని తాము ప్రశ్నించినా వారు సమాధానం చెప్పడం లేదని రైతులు వాపోతున్నారు.

కట్టడాలపై ఆందోళనకు సిద్ధం

తమ భూమి అమ్మకం చేయడానికి కేవలం ఒప్పందం మాత్రమే కుదుర్చుకున్నామని, తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా శాశ్వత నిర్మాణాలు చేపట్టడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆందోళనకు దిగి కట్టడాలను అడ్డుకోవాలని నిర్ణయించి తహశీల్దార్, పోలీసులకు రైతులు నోటీసులు అందించారు. వీటిపై స్పందించి కొద్దిరోజులు వాయిదా వేయాలని స్థానిక తహశీల్దార్ ద్వారా రైతులను కోరగా వారు అంగీకరించి వాయిదా వేశారు. ఈనెల 15తో వాయిదా ముగియనుండడంతో ఇక ఆందోళన చేయడానికి ముందుకు వెళ్లాలని రైతులు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

సమాచారం ఇవ్వకుండా నిర్మాణాలు

-సలాది నాగేశ్వరరావు, రైతు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పెదపళ్ల



మేము అమ్మకాలు చేయడానికి ఒప్పందం మాత్రమే కుదుర్చుకున్నాం. రిజిస్ట్రేషన్ చేయించుకోకుండా శాశ్వత నిర్మాణాలు చేయడం అన్యాయం. దీనిపై ఉన్నతాధికారులకు తెలియజేశాం. వారుసకాలంలో స్పందించి మాకు న్యాయం చేస్తే మంచిదే, లేకపోతే ఆందోళనకు సిద్ధమవుతాం.

రైతులపట్ల నిర్లక్ష్యం తగదు

-బొబ్బా వెంకన్న రైతు, పెదపళ్ల, ఆలమూరు మండలం



రైతుల వద్ద భూమిని కొనుగోలు చేసుకుని ఓఎన్జీసీ అధికారులు శాశ్వతంగా నిర్మాణాలు చేయడానికి సిద్ధం కావాలి. రైతులను నిర్లక్ష్యం చేసి ఏ సమాచారంఇవ్వకుండా నిర్మాణాలు చేయడం అన్యాయం. రైతులకు న్యాయం జరగాలి. లేని పక్షంలో ఆందోళనే శరణ్యం.

కుంటుపడుతున్న ప్రాథమిక విద్య



కాట్రేనికోన ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు చెప్తున్న ఒకే ఉపాధ్యాయుడు

» కాట్రేనికోన మండలంలో అధికశాతం ఏకోపాధ్యాయ పాఠశాలలే
» ఇక్కడ ఖాళీలు భర్తీ అయ్యేనా?

కాట్రేనికోన, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): టీచర్ల కొరతతో కాట్రేనికోన మండలంలోని పాఠశాలలన్నీ ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారి నామమాత్రంగా నడుస్తున్నాయి. ప్రాథమిక విద్య ఆరంభంలోనే అణగారిపోతోందన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. ఈ కారణంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోని పేద విద్యార్థులు విద్యకు దూరమై నష్టపోతున్నారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనం పిల్లల నోటి వరకు రావడంలేదు. సముద్రతీర మండలమైన కాట్రేనికోనలో పనిచేసేందుకు ఉపాధ్యాయులు ముందుకు రాని పరిస్థితి ఆది నుంచి ఉంది. ఇక్కడ కొత్తగా ఉద్యోగం వచ్చినా, బదిలీ అయినా బాబోయ్ కాట్రేనికోన మండలం అంటూ భయపడిపోతూ వేరే ప్రాంతాలకు పైరవీలతో వెళ్లిపోవడం పరిపాటి అయ్యింది. తప్పనిసరి పరిస్థితిలో ఉద్యోగంలో చేరి రోజులు గడుపుతూ ఉంటారు. ఇందుకు నిదర్శనంగా స్థానికులు తప్ప మిగిలిన ఉపాధ్యాయులు అమలాపురం, కాకినాడ, రాజమహేంద్రవరం, ముమ్మిడివరం వంటి ప్రాంతాలనుంచి వచ్చి వెళ్తూ ఉంటారు. రహదారి, రవాణా సౌకర్యాలతోపాటు రక్షిత తాగునీరు అందుబాటులో ఉంది. గ్రామాలన్నీ సౌకర్యాలతో అలరారుతున్నాయి. ఈ మెగా డీఎస్సీలోనైనా మండలంలోని టీచర్ పోస్టులు భర్తీ చేస్తారో లేదో తెలియదు. ఇక్కడి నుంచి 98మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. బదిలీ అయిన వారిలో ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 50శాతం మందిని రిలీవ్ చేశామని ఎంఈవోలు చెబుతున్నారు. దీంతో ఏకోపాధ్యాయుడే పాఠశాలల్లో బహుపాత్రాభినయం చేస్తున్నాడు. కాట్రేనికోన మండలంలోని నాగపట్నం, రాజానగరం, కాట్రేనికోన మెయిన్, పెనుమెల్ల, దొంతికుర్రు, అడవిపేట, గాజింగతిప్ప, బ్రహ్మసమేధ్యం, నీళ్లరేవు, పల్లంకుర్రు, బొజ్జావారిపేట తదితర ప్రాథమిక పాఠశాలల్లో ఏకోపాధ్యాయునితో నెట్టుకొస్తున్నారు. 20 నుంచి 40 మంది విద్యార్థులున్నా ఒకేఒక్క ఉపాధ్యాయుడు విద్యార్థులను కాపలా కాయడం తప్ప చదువు చెప్పే పరిస్థితి లేదు. మండలంలో 63 ఎంపీపీ పాఠశాలలు, నడవపల్లిలో యూపీ స్కూల్ ఒకటి, 11 హైస్కూళ్లు ఉన్నాయి. మగసానితిప్పలో విద్యార్థులు లేరన్న సాకుతో పాఠశాల మూసేసి రెండేళ్లయ్యింది. గెద్దనాపల్లిలో ఇటీవల తెరిచిన పాఠశాల ఏకోపాధ్యాయుడితో సాగుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతతో విద్యా ప్రమాణాలు దిగజారిపోయాయని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. దీంతో ప్రైవేటు స్కూళ్లను ఆశ్రయిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు కాట్రేనికోన మండలానికి అధిక ప్రాధాన్యమిచ్చి ఉపాధ్యాయ ఖాళీలన్నీ భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మళ్లీ పెరుగుతున్న వరద

» ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న లంకలు
» ధవళేశ్వరం బ్యారేజీ నుంచి సముద్రంలోకి 5లక్షల క్యూసెక్కుల వరదనీరు విడుదల

పి.గన్నవరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): గోదావరికి వరదలు సాధారణంగా జూలై మొదటివారం నుంచి ప్రారంభమై ఆగస్టు నెలాఖరుకు తగ్గుముఖం పడతాయి. సెప్టెంబరు మొదటి వారంలో నీరు ఎరుపు రంగు ఉన్నా గోదావరి నదీపాయలు సాధారణస్థాయికి చేరుకుంటాయి. ఈసారి మాత్రం వరదలు భారీ స్థాయిలో రాకపోయినా ఎక్కువరోజులు నదీపాయలు నిండుగా ప్రవహించాయి. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో దిగువన గోదావరిలో వరద నీటిమట్టం వారంరోజుల క్రితం వరకు ఉధృతంగానే ప్రవహించింది. ప్రస్తుతం గోదావరిలో నీటిమట్టం సాధారణస్థాయికి చేరుకుని వారం రోజులు గడవకుండానే మళ్లీ వరదనీరు పోటెత్తింది. ఎగువన కురుస్తున్న వర్షాలకు వరద నీరు పెరుగుతుండడంతో దిగువన ధవళేశ్వరం బ్యారేజీ నుంచి దిగువన సముద్రంలోకి 5,06,438 క్యూసెక్కులు వదులుతున్నారు. దీంతో జిల్లాలో ప్రవహించే వైనతేయ, వశిష్ట, గౌతమి, వృద్ధగౌతమి నదీపాయలు నిండుగా ప్రవహిస్తున్నాయి. చాకలిపాలెంవద్ద కనకాయలంక కాజ్‌వే వారంరోజుల క్రితం వరదనీరు నుంచి బయటపడింది. గోదావరి మరింత పెరిగితే కాజ్‌వే మళ్లీ నీటమునిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంటిపెదపూడివద్ద బూరుగులంక నదీపాయపై పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక, ఉడిమూడిలంక గ్రామస్తులు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లా గ్రామాలైన అనగార్లంక,పెదమల్లంక గ్రామస్తులు నాటు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. ఈసారి ధవళేశ్వరం నుంచి 7లక్షల క్యూసెక్కుల వరకు వరదనీటిని దిగువకు వదిలే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు. ఇప్పుడిప్పుడే బయటపడుతున్న ఉద్యాన పంటలకు మళ్లీ వరదనీరు చేరితే పంటలకు తీవ్రనష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పి.గన్నవరం కొత్త, పాత అక్విడెక్టుల మధ్య వరద ప్రవాహం

గోదావరి పరవళ్లు



ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి విడుదలవుతున్న వరద నీరు

5,06,438 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల

ధవళేశ్వరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద గోదావరి పరవళ్లు తొక్కుతూ సముద్రంలోకి ప్రవహిస్తోంది. ఆదివారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ ధవళేశ్వరం, ర్యాలి ఆర్మ్‌లోని మొత్తం గేట్లను 1.5 మీటర్లు.. మద్దూరు, విజ్జేశ్వరం ఆర్మ్‌లోని మొత్తం గేట్లను మీటరు మేర పైకి ఎత్తి 5,06,438 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. దీంతో ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 10 అడుగులుగా నమోదైంది. ఎగువన భద్రాచలం వద్ద 36.10 అడుగుల వరకు పెరిగిన నీటి మట్టం నిలకడగా కొనసాగుతోంది.



వరద నీటిలో ఉన్న గండిపోశమ్మ అమ్మవారి ఆలయం

వరద నీటిలో గండిపోశమ్మ ఆలయం

దేవీపట్నం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా దేవీపట్నం మండలంలో గోదావరి మళ్లీ పెరుగుతుంది. ప్రసిద్ధి పుణ్యక్షేత్రం మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయం వరద నీటిలోనే ఉంది. అలాగే పాపికొండల విహారయాత్ర పర్యాటక బోట్లను నిలిపివేశారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ద్రాక్షారామలో రాట ముహూర్తం



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో రాట ముహూర్తం చేస్తున్న ఈవో తదితరులు

ద్రాక్షారామ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో ఈనెల 22 నుంచి జరగనున్న దేవీశరన్నవరాత్రి ఉత్సవ ఏర్పాట్లకు ఆదివారం శాస్త్రోక్తంగా రాట ముహూర్తం జరిపారు. ఉదయం ఆలయ ఈవో అల్లు వెంకట దుర్గాభవానీ, సత్యంవాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం, కృష్ణ కుమారి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. 10.58 గంటలకు రాట ముహూర్తం చేశారు. ఆలయ అర్చకులు, వేదపండిత బృందం కార్యక్రమం జరిపించారు. సర్పంచ్ కొత్తపల్లి అరుణ, నాటక అకాడమీ డైరెక్టరు పెంకే అన్నపూర్ణ, కూటమి నాయకులు పెంకే సాంబశివరావు, సంపత్, ఏడుకొండలు, భక్తులు పాల్గొన్నారు.

'లోవ'లో భక్తుల కోలాహలం



క్యూలో బారులుతీరిన భక్తులు

రూ.6.14 లక్షల ఆదాయం



తలుపులమ్మ అమ్మవారు

తుని రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. క్యూలలో బారులు తీరి అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం ఏర్పాటు చేసిన వసతి గదుల్లో కుటుంబ సమేతంగా వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. ఆలయానికి వివిధ విభాగాల ద్వారా రూ.6.14 లక్షల ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో పి.విశ్వనాధ రాజు తెలిపారు.

పంటకాలువలో వృద్ధురాలి మృతి



వృద్ధురాలి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

ఆత్రేయపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పంటకాలువలో వృద్ధురాలు ప్రమాదవశాత్తు మృతిచెందిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురానికి చెందిన అవిడి సత్యవతి(60) ఆదివారం ఉదయం లొల్ల పాత బ్రిడ్జి పంటకాలువలో శవమై తేలింది. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. సత్యవతి శనివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంటికి రాలేదని ఆమె తమ్ముడు సూర్యారావు తెలిపాడు. మృతదేహాన్ని పరిశీలించి తన అక్కగా నిర్ధారించాడు. సంఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి



నాగబాబు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అల్లవరం, సెప్టెంబరు 14 (ఆంధ్ర జ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం డి.రావులపాలెం గ్రామానికి చెందిన కాంట్రాక్టరు వంటెద్దు నాగబాబు (40) ఆదివారం ఆక్వా చెరువుల వద్ద విద్యుదాఘాతానికి గురై మరణించాడు. నాగబాబు గుండెపూడిలో తాను కౌలు సాగు చేస్తున్న ఆక్వా చెరువుల వద్ద పాడైన ఏరియేటర్‌ను బాగు చేసేందుకు చెరువులో దిగి విద్యుఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడని పోలీసులు తెలిపారు. రొయ్యల చెరువుల వద్ద నాగబాబు మృతదేహాన్ని వెలికితీసి అల్లవరం ఎస్ఐ బి.సంపత్‌కుమార్ దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికై అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. నాగబాబు మృతి పట్ల పంచాయతీ రాజ్ డీఈఈ అన్యం రాంబాబు, సొసైటీ అధ్యక్షుడు వేగిరాజు వెంకట్రాజు, టిక్కా వెంకటప్రసాద్, ఆకుల లక్ష్మణరావు, పోతుల చంద్రబోస్ సంతాపం వ్యక్తం చేశారు.

కరాటే పోటీల విజేత ఉమ్మడి జిల్లా

పేరూరులో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల కరాటే పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ హరీష్‌మాధుర్

అమలాపురం రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం పేరూరు పీఆర్కే ఫంక్షన్ హాలులో ఆదివారం పవర్‌కిక్ షోటోకాన్ కరాటే డూ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి తెలుగు రాష్ట్రాల కరాటే పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రథమస్థానంలో నిలిచింది. పోటీలను ఆదివారం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ ప్రారంభించారు. 6 ఏళ్ల నుంచి 18 ఏళ్ల వయసు గల సుమారు 952 మంది క్రీడాకారులు పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచినట్టు చీఫ్‌ఆర్గనైజర్ పడాల అంజి తెలిపారు. కటాస్, కుమిటీ విభాగాల్లో ఈ పోటీలను ఆర్గనైజింగ్ కార్యదర్శి చిక్కం సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రథమస్థానం, తెలంగాణకు ద్వితీయ స్థానం దక్కింది. వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వివిధ విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. గంటి హరీష్‌బాలయోగితో పాటు టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు పతకాలు, ప్రశంసాపత్రాలను అందించారు. పోటీల్లో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.

మండపేటలో ముగిసిన రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలు



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

మండపేట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో 2రోజులపాటు జరిగిన 49వ రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. రాష్ట్రంలోని 17 జిల్లాల నుంచి వచ్చిన 17 జట్లకు చెందిన క్రీడాకారులు పాల్గొనగా జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే బాలురు, బాలికల జట్లను ఎంపిక చేశారు. అక్టోబరు 8 నుంచి 12 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని నోయిడాలో జరిగే జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైన జట్ల వివరాలను టెన్నికాయిట్ రాష్ట్ర అసోసియేషన్ కోశాధికారి రిఫరీ కుంచే రమేష్ తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు జట్ల ఎంపిక

జట్లకు ఎంపికైన వారు..

బాలుర జట్టుకు రామారావు(కాకినాడ), వినయ్ (కాకినాడ), బి.సిద్దార్థ (శ్రీకాకుళం), రాహుల్(విజయనగరం), చంటిబాబు (తూర్పు గోదావరి), పి.సాగర్ (అనకాపల్లి), కె.చంద్రమౌళి (విజయనగరం), బి.ఉదయ్‌కుమార్ (శ్రీకాకుళం)... బాలికల జట్టుకు సంబంధించి పి.మౌనిక (విజయనగరం), జి.హేమమాధురి (తూర్పు గోదావరి), పి.రేణుక (విజయనగరం), జి.సుప్రియ (అనంతపురం), కె.నారాయణమ్మ(విశాఖ), కె.ఇందు (విజయనగరం), కె.అనిత(కాకినాడ) ఎంపికయ్యారు. జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో విజేతలైె వారిని 2027లో అంతర్జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేస్తారని రమేష్ తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన వారికి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పట్టణానికి చెందిన వేగుళ్ల చైతన్య బాబు, కాకినాడకు చెందిన రెడ్‌క్రాస్ ఛైర్మన్ వైడీ రామారావు, ముత్యాల బాలమురళీకృష్ణ బహుమతులు అందజేశారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు గెడా శ్రీనివాస్, మండపేట జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎమ్ ముంగర వెంకట్రాజు, పి.తవిటయ్య, కేవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

కార్మికుల జీవితాల్లో కానరాని మార్పులు

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు



ప్రసంగిస్తున్న ఉమామహేశ్వరరావు

సామర్లకోట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నా కార్మికుల జీవితాల్లో మార్పులు కానరావట్లేదని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం కాకినాడ జిల్లా సామర్లకోట లయన్స్ క్లబ్ భవనంలో సామర్లకోట, అమలాపురం ఏపీబీసీఎల్ హమాలీ వర్కర్ల యూనియన్ 5వ మహాసభను ఘనంగా నిర్వహించారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 6.5 లక్షల మంది ప్రభుత్వ, ప్రైవేటు గోదాముల్లో కార్మికులుగా పనిచేస్తున్నారని వారికి శ్రమకు తగిన రీతిలో వేతనాలు అందట్లేదన్నారు. తొలుత సీఐటీయూ పతాకాన్ని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారెడ్డి ఆవిష్కరించారు. రాష్ట్రంలోని 17 ఏపీబీసీఎల్ డిపోల నుంచి 150 మంది హమాలీలు హాజరయ్యారు. సీఐటీయూ నాయకులు దువ్వా శేషుబాబ్జీ, ఎం.మదన్‌మోహన్, రాష్ట్ర కార్యదర్శి విప్పర్తి కొండలరావు, రామారావు, వి.అప్పలరాజు, సోమేష్, ఎం.రామారావు, ఎం.ప్రసాద్ పాల్గొన్నారు.

హమాలీ వర్కర్స్ నూతన కార్యవర్గం

ఆంధ్రప్రదేశ్ బెవరేజస్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ నూతన కార్యవర్గ ఎన్నికలను ఆదివారం సామర్లకోటలో నిర్వహించారు. అధ్యక్షుడిగా విప్పర్తి కొండలరావు, కార్యదర్శిగా ఎం.మదన్‌మోహన్, గౌరవాధ్యక్షుడిగా ఉమామహేశ్వరరావు, కోశాధికారిగా బత్తుల కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఎన్వీ సుబ్బారెడ్డి, ఎన్.ప్రసాదరావు, రామారావు, మూర్తి, రాముడు, మల్లికార్జున్, సాంబయ్య, కార్యదర్శులుగా కొండలరావు, తిరుషేక్, శ్రీనివాసు, సూర్యచంద్ర, మణిప్రసాద్, పవన్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా అప్పలరాజు, ఆర్.సుబ్బారాయుడు, చిన్న, ప్రశాంత్, మోహన్‌రాము ఎన్నికయ్యారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు బలరామపురం విద్యార్థి



బంగారు పతకాలతో శ్రీనివాస్

రౌతులపూడి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి జావెలిన్ త్రో,షార్ట్‌పుట్ పోటీలకు కాకినాడ జిల్లా రౌతులపూడి హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న బలరామపురం గ్రామానికి చెందిన పైల శ్రీనివాస్ ఎంపికయ్యాడు. ఆదివారం కాకినాడ ఏపీ ఎస్పీలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించి ఈనెల 25,26న ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎమ్ కోళ్ల రాంబాబు తెలిపారు.

16 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం

ఎటపాక, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): 16 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు ఆదివారం రాత్రి అల్లూరి జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నంలోని శిథిలమైన ఓ ఇంట్లో స్వాధీనం చేసుకున్నారు. పురుషోత్తపట్నం సమీపంలోని సెయింట్‌ఆన్స్ పాఠశాల సమీపంలో శిథిలమైన ఇంట్లో పీడీఎస్ బియ్యం నిల్వలు ఉంచినట్టు తహసీల్దార్‌కు సమాచారం అందింది. దీంతో తహసీల్దార్ కారం సుబ్బారావు సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. ఆ ఇంట్లో బస్తాల్లో నిల్వలు చేసిన బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 16 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేసి పురుషోత్తపట్నంలోని రేషన్ దుకాణానికి తరలించారు.

పోగొట్టుకున్న రూ.10 లక్షల విలువైన బంగారు ఆభరణాల అప్పగింత



రూ.10 లక్షల విలువైన బంగారు ఆభరణాలు అప్పగిస్తున్న అన్నవరం ఎస్ఐ

అన్నవరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం సెక్యూరిటీ అప్రమత్తతతో ఆదివారం రాత్రి ఒక వ్యక్తి పోగొట్టుకున్న సుమారు రూ.10 లక్షల విలువైన బంగారు ఆభరణాలు తనచెంతకు చేరాయి. వివరాల్లోకి వెళితే కాకినాడ నుంచి విశాఖపట్నం వెళ్తున్న కాజా మొయినుద్దీన్ అన్నవరం దేవస్థానం టోల్‌గేట్ సమీపంలో తన బంగారు ఆభరణాలు కలిగిన బ్యాగ్‌ను వేరే వ్యక్తుల బ్యాగ్‌లో కలసిపోవడంతో దీనిని గమనించిన దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది వాటిని తీసుకుని అన్నవరం ఎస్ఐ హరిబాబు సమక్షంలో మొయినుద్దీన్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా అతడు అన్నవరం దేవస్థానం సెక్యూరిటీ వ్యవస్థను అభినందించారు.

పిచ్చికుక్క దాడి

ఎనిమిది మందికి గాయాలు

గండేపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామం పాతూరులో శనివారం రాత్రి పిచ్చికుక్క గ్రామస్తులపై దాడి చేసి 8 మందిని గాయపరిచింది. పిచ్చికుక్క దాడితో గ్రామస్తులు భయంతో పరుగులు తీశారని స్థానికులు తెలిపారు. గాయపడిన 8 మంది జెడ్.రాగంపేట ప్రభుత్వాసుపత్రిలో చేరారు. గాయపడ్డవారిలో పవన్, చంద్రం, అంకం శ్రీను, రావుల నారాయణరావు, రావిపాటి అబ్బు, చింతపలి శ్రీను, బోను శ్రీను, వినోద్ ఉన్నారు.

రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో తూర్పుగోదావరి జిల్లాకు ప్రథమం



పోటీల్లో ప్రథమస్థానం సాధించి కప్ అందుకుంటున్న తూర్పుగోదావరి జిల్లా బాలురు

బిక్కవోలు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో తూర్పు గోదావరి జిల్లా బాలురు ప్రథమ స్థానం, బాలికలు తృతీయ స్థానం సాధించారు. అనంతపురం జిల్లా ధర్మవరం మండలం రామాపురంలో ఈ నెల 12 నుంచి జరిగిన పదో అండర్-19 రాష్ట్ర స్థాయి బాల,బాలికల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. పోటీల్లో బాలుర నుంచి తూర్పుగోదావరి జిల్లా జట్టు చిత్తూరు జిల్లాపై విజయం సాధించి ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. ఈ టీమ్‌లో బిక్కవోలుకు చెందిన వినయ్, మణికంఠరెడ్డి, కైలాష్, హేమంత్ ఆడారు. కెప్టెన్‌గా వ్యవహరించిన వినయ్ అనంతపురం జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నుంచి టీమ్ సభ్యులతో పాటు కప్ అందుకున్నారు. అలాగే జిల్లా బాలికలు శ్రీకాకుళం జట్టుపై తలపడి విజయం సాధించి మూడో స్థానంతో సరిపెట్టుకున్నారు. ఈ టీమ్‌లో బిక్కవోలుకు చెందిన చాందినిప్రియ, అలేఖ్య, శిరీష, భార్గవి పాల్గొన్నారని జిల్లా బాల్‌బాడ్మింటన్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పన స్వామి, ముప్పన వీర్రాజు, సభ్యులు సీతాపతిరావు తెలిపారు. బాలుర టీమ్ కోచ్‌గా పీఈటీ మోహనరావు, బాలికలకు సునీత కోచ్‌లుగా వ్యవహరించారు.

ఖతర్ నుంచి సురక్షితంగా స్వగ్రామానికి..

కోనసీమ మహిళ రాక



కనకమహాలక్ష్మి

అమలాపురం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఖతర్ దేశంలో తీవ్ర అనారోగ్యం, యజమాని పని ఒత్తిడి కారణంగా ఇబ్బందులు పడుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లంకుర్రు మొక్కలతిప్ప జైభీమ్ నగర్‌కు చెందిన గోడి కనకమహాలక్ష్మిని కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్(కేసీఎం) సహకారంతో సురక్షితంగా స్వగ్రామానికి తీసుకొచ్చినట్టు డీఆర్వో కె.మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. మహాలక్ష్మి వాట్సాప్, వీడియో సందేశాల ద్వారా తన యజమానులు, ఏజెంట్ పెడుతున్న చిత్రహింసలపై చేసిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ స్పందించారు. ఆమెను స్వదేశానికి తీసుకురావడానికి కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ నోడల్ అధికారి, డీఆర్వో కె.మాధవిని ఆదేశించారు. దీనిపై స్పందించిన ఆమె విదేశీ రాయబార కార్యాలయంతో సంప్రదింపులు జరిపి అక్కడి ఏజెంట్ల సహకారంతో కనకమహాలక్ష్మిని సురక్షితంగా స్వదేశానికి రప్పించినట్టు కేసీఎం సెంటర్ సమన్వయ అధికారి గోళ్ల రమేష్ తెలిపారు. ఖతర్‌లో అధిక పని ఒత్తిడి, యజమానుల వేధింపులు, సరైన ఆహారం లేకపోవడం వల్ల తీవ్ర అనారోగ్యం పాలై తాను చివరికి ఆత్మహత్యకు కూడా పాల్పడేందుకు సిద్ధమైన సమయంలో సాయం చేసినందుకు కోనసీమ కలెక్టర్, కేసీఎం బృందానికి కనకమహాలక్ష్మి కృతజ్ఞతలు తెలియజేశారు.

నేటి నుంచి యూటీఎఫ్ రణభేరి యాత్ర

దివాన్‌చెరువు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక, విద్యా రంగ సమస్యలపై యూటీఎఫ్ తలపెట్టిన రణభేరి యాత్ర సోమవారం నుంచి ప్రారంభమవుతుందని ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి సీహెచ్ దయానిధి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 15న సోమవారం ఈ రణభేరి యాత్ర తునిలో బయలుదేరి ఆరోజు కాకినాడ జిల్లాలో పర్యటిస్తుందన్నారు. 16న అల్లూరి సీతారామరాజు జిల్లాలో యాత్ర సాగుతుందని, 17న తూర్పుగోదావరి జిల్లాలోని గోకవరం నుంచి ప్రారంభమై కోరుకొండ, రాజానగరం, రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం రూరల్, కడియం మీదుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని మండపేటకు చేరుకుంటుందని తెలిపారు. ఉపాధ్యాయులకు బోధనేతర విధుల నుంచి విముక్తి కల్పించాలని, పాఠశాలలో ఒత్తిడి లేకుండా పనిచేసే వాతావరణం కల్పించాలని, ఉమ్మడి సర్వీస్ రూల్స్ ద్వారా ప్రమోషన్లు కల్పించాలని, 12వ పీఆర్‌సీ కమిషనర్‌ను నియమించి ఐఆర్ వెంటనే ప్రకటించాలని, డీఏలు విడుదలచేసి బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

రాజానగరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పాల ప్యాకెట్ కోసం నడిచి వెళ్తున్న వ్యక్తిని మోటార్‌సైకిల్ ఢీకొనడంతో మృతిచెందాడు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోలమూరు గ్రామ సెంటర్‌లో జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మోర్త సూరిబాబు(40) ఆదివారం ఉదయం పాల ప్యాకెట్ కోసం షాపునకు నడుచుకుంటూ వెళ్తుండగా వేగంగా వస్తున్న మోటార్‌సైకిల్ బలంగా ఢీకొంది. సూరిబాబు తలకు బలమైన గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు రాజానగరం ఎస్ఐ ఎస్.ప్రియకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని...

రాజనగరం మండలం నరేంద్రపురం చెలగంపాడు కాలనీకి చెందిన దాకారపు సీతారామయ్య(56) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడికి మద్యం తాగే అలవాటు ఉంది. ఈనెల 10న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పాలచర్లలోని తాడేలమ్మ ఆలయం సమీపంలో గోదావరి టౌన్‌షిప్ లేఅవుట్‌లో వేప చెట్టుకు పంచెతో ఉరేసుకున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి కుమారుడు మణికంఠ ఫిర్యాదుతో ఎస్ఐ ప్రియకుమార్ కేసు నమోదు చేశారు.

గడ్డిమందు తాగి పండ్ల వ్యాపారి ఆత్మహత్య

సామర్లకోట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట స్టేషన్ సెంటర్ వద్ద పండ్ల వ్యాపారం చేసుకునే తలారి గోవిందు (పులిరాజు 45) దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ రెండు రోజుల క్రితం జీవితంపై విరక్తి చెంది గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న పులిరాజును చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించి వైద్యం అందించగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందినట్టు సామర్లకోట పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నట్టు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సామర్లకోట పోలీసులు తెలిపారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

అంతర్వేది, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనం అనంతరం రాజమహేంద్రవరానికి చెందిన అఖండం వెంకటరమణమూర్తి, కుటుంబ సభ్యులు నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.50వేలువ విరాళం అందించారు. దాతలకు సహాయ కమిషనర్ ఎంకేటీవీఎన్వీ ప్రసాద్ స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

తైక్వాండోతో ఆత్మరక్షణ

అంబాజీపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): తైక్వాండో శిక్షణతో ఆత్మరక్షణ కలుగుతుందని ఎస్ఐ కె.చిరంజీవి అన్నారు. ఇటీవల నిర్వహించిన తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్‌కు సంబంధించి అంబాజీపేట హైస్కూల్ ప్రాంగణంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు తైక్వాండో కోచ్ పితాని త్రిమూర్తులు అధ్యక్షతన బెల్ట్ సర్టిఫికెట్లను అందించారు

ముంపులో అశ్వరూఢాంబిక ఆలయం

- వెనుతిరిగి వెళ్లిపోతున్న భక్తులు
- చుట్టూ నీరు చేరడంతో శిథిలావస్థకు చేరుకుంటున్న ఆలయం



వర్షం నీటి ముంపులో ఉన్న అశ్వరూఢాంబిక అమ్మవారి ఆలయం, అశ్వరూఢాంబిక (గుర్రాలక్క)

అంతర్వేది, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): అశ్వరూఢాంబిక ఆలయం చుట్టూ ముంపు నీరు చేరుకుంటోంది. అంతర్వేది పుణ్యక్షేత్రంలో తొలి దర్శనం క్షేత్ర పాలకుడు అంజనేయస్వామి, బ్రహ్మచే ప్రతిష్ఠించబడిన పార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయం, శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో స్వామివారి సోదరి అశ్వరూఢాంబిక ఆలయాన్ని భక్తులు సందర్శిస్తారని క్షేత్ర పురాణాలు చెబుతున్నాయి. అమ్మవారి ఆలయంలో ప్రతీరోజు అర్చకులు పూజలు చేస్తూ భక్తులకు దర్శనాలు కల్పిస్తారు. స్వయంభూగా అమ్మవారి వెలిసింది. ఈఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఆషాఢమాసం, దసరా, విశేషమైన రోజుల్లో అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలు జరుగుతాయి. ఎంతో ప్రముఖ చరిత్ర కలిగి అమ్మవారి దీవెనలతో పిల్లలకు అక్షరాభ్యాసం చేసుకునేందుకు భక్తులు వస్తుంటారు. ప్రతీ సంవత్సరం అమ్మవారి ఆలయం వర్షం నీటితో ముంపునకు గురవుతోంది. ఈఏడాది వర్షాలు లేకపోయినా వరద, పోటు నీటితో ఆలయం చుట్టూ రెండు అడుగులు నీరు చేరింది. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు వెనుదిరిగి వెళ్లిపోతున్నారు. మరికొంత మంది అమ్మవారిని దర్శించుకోవాలని ప్రయత్నిస్తే జారి పడిపోవడం, ముంపు నిల్వ నీటిలో వెళ్లిన వారికి దురదలు రావడంతో భయభ్రాంతులకు గురవుతున్నారు. అర్చకుడు మాత్రం నిత్యం ఉదయం, సాయంత్రం ఆ ముంపు నీటిలో నుంచే వెళ్లి అమ్మవారికి ధూప, దీప నైవేద్యాలు సమర్పిస్తున్నారు. రహదారి నుంచి 50 మీటర్ల దూరంలో ఉన్న అమ్మవారి ఆలయానికి రోడ్లు వేస్తామని గత పాలకులు హామీ ఇచ్చారు. సొంత నిధులు, ప్రభుత్వ నిధులతో రోడ్ల నిర్మాణంతో పాటు ఆలయ పునఃనిర్మాణం చేపడతామని ఇంతవరకు ముందుకు రాకపోవడంతో ఆలయం ముంపునీటిలో శిథిలావస్థ స్థితికి చేరుకుంటుంది. ఆలయానికి చుట్టూ ఉన్న రైతులు అభివృద్ధికి అడ్డుకుంటున్నారని దేవదాయశాఖ అధికారులు తెలిపారు. అమ్మవారి ఆలయానికి రహదారి నిర్మాణం ఎంత అవసరమో ఆలయ పునఃనిర్మాణం కూడా అంతేఅవసరం. ప్రస్తుతం ఆలయానికి చుట్టూ చేరి ఉన్న నీరు కొన్ని నెలలు నిలిచిపోవడంతో భక్తులెవరూ అమ్మవారి దర్శనానికి వెళ్లడం లేదు. అంతర్వేది పుణ్యక్షేత్రం భక్తులతో నిత్యం సందడిగా ఉంటుంది. స్వామివారి ఆలయానికి కిలోమీటరు దూరంలో ఉన్న అమ్మవారి ఆలయం మాత్రం భక్తుల దర్శనానికి నోచుకోకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీవీఎన్వీ ప్రసాద్‌ను వివరణకోరగా దేవదాయశాఖ అధికారులు, ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌లతో ఆలయ అభివృద్ధిపై చర్చిస్తామని తెలిపారు.

షోడశ కర్మల్లో చిన్నపాటి మార్పులు తప్పవు

- కృష్ణ యజుర్వేద పరీక్షాధికారి మహంకాళి దత్తాత్రేయశర్మ



కోనసీమ వేదశాస్త్ర సన్మాన సభలో మాట్లాడుతున్న సోమయాజి ఘనాపాఠి

అమలాపురం రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): షోడశ కర్మల నిర్వహణలో చిన్నచిన్న మార్పులు తప్పవని కృష్ణ యజుర్వేద పరీక్షాధికారి మహంకాళి దత్తాత్రేయశర్మ పేర్కొన్నారు. శ్రీకోనసీమ వేదశాస్త్ర సన్మాన సభ ఆధ్వర్యంలో అమలాపురం చంద్రమౌళీశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం స్మార్త ఆగమ, అపర విద్వత్సభ వేదఘోషల మధ్య వైభవంగా జరిగింది. ఈసభకు భీమవరం మావుళ్లమ్మ దేవస్థాన ఆస్థాన విద్వాంసులు ఈవని వేంకటరామచంద్రసోమయాజి ఘనాపాఠి అధ్యక్షత వహించారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వేదముల నుంచే స్మార్తఆగమ అపర కర్మల విధానాలు జన్మించాయని వివరించారు. వైఖానస ఆగమ పండితులు, అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థాన విశ్రాంత ప్రధానార్చకులు వాడపల్లి శేషాచార్యులు తొలుత అంతర్వేది స్వామివారి చరిత్రను వివరించారు. అనంతరం యజుర్వేద, రుగ్వేద అపర పండితులు భగవతి నారాయణశాస్త్రి, శైవాగమ పండితులు నవులూరి దీక్షితులు, వాస్తు, జోతిష్య పండితులు గరిమెళ్ల భాస్కరగంగాధరశాస్త్రి మాట్లాడారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 152మంది స్మార్త ఆగమ అపర పండితులు పాల్గొన్నారు. అనంతరం పండిత సత్కారం నిర్వహించారు. బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన ఆకెళ్ల వేంకట నారాయణ అవధానిని శ్రీకోనసీమ వేదశాస్త్ర సన్మాన సభ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వ్యవస్థాపకులు గుళ్లపల్లి వేంకట్రామ్, యేడిద సుబ్రహ్మణ్యశర్మ, శిష్ట్లాభాస్కర్, ఆదిరాజు భాస్కరశర్మ, పుత్సా కృష్ణ కామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రామదాసు జీవితం ఉపాధ్యాయులకు అనుసరణీయం



ఆదర్శ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులతో డాక్టర్ శ్రీనివాస్

అమలాపురం రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): నైతిక విలువలతో కూడిన విద్యను బోధించడంతో పాటు సామాజిక బాధ్యతను గుర్తుచేస్తూ విద్యాబోధన చేసి వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దిన నిష్ఠల రామదాసు జీవితం ఉపాధ్యాయులందరికీ అనుసరణీయమని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నూజిళ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఏబీవీపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు అంజని శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం ఈదరపల్లిలోని జనహిత కార్యాలయంలో రామదాసు స్మారక ఆదర్శ ఉపాధ్యాయ పురస్కారం-2025 కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ శ్రీనివాస్ హాజరై అనేక అంశాలను వివరించారు. ఆదర్శ ఉపాధ్యాయులుగా కేవీజీ లక్ష్మినరసమ్మ, కెఆర్ఎస్ పద్మావతి, ఆర్.వల్లాలమ్మదేవి, పాటి రామకృష్ణ, ఎం.నాగసూర్యనారాయణ, అడబాల వీఎల్ నరసింహారావు, కె.మురళీధర్, అబ్బిరెడ్డి రామకృష్ణ, డాక్టర్ పీఎస్‌వీఎస్ సూర్యనారాయణమూర్తి, ఎస్.గుణరంజన్, పీవీఎల్ఎన్ శ్రీరామ్‌లను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఘనంగా సత్కరించి షీల్డులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవస్థాపక ప్రముఖ్ బి. రాంప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు శ్రీకాంత్‌వర్మ, బి.కేశవ్, కె.గంగాధర్, బులుసు జగదీష్, దొంగ మోహన్, పార్థసారధి, నందూరి శ్రీరామ్, సంస్కారభారతి రాష్ట్ర మహిళా ప్రముఖ్ వేదనభట్ల సాయిలక్ష్మి-కళాపూర్ణారావు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ ద్వారా పిచికారీతో మంచి ఫలితాలు

మామిడికుదురు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): డ్రోన్ ద్వారా వరి చేలకు మందులను పిచికారీ చేయడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయని డీపీఎం శ్రీనివాస్ తెలిపారు. ఈదరాడలో యెరుబండి లక్ష్మయ్య ప్రకృతి వ్యవసాయ కేంద్రంలో సహజసిద్ధంగా తయారుచేసిన అగ్ని అస్త్రం ద్రావణాన్ని డ్రోన్ ద్వారా ఆదివారం పిచికారీ చేయించారు. ప్రస్తుతం సార్వా వరి చేలు చిరుపొట్ట దశలో ఉన్నాయని, ఈసమయంలో కాండం తొలుచు పురుగు, ఆకుముడత తెగులు వ్యాపిస్తుందన్నారు. ఆకుముడత తెగులు నివారణకు అగ్ని అస్త్రం చక్కగా పనిచేస్తుందని, ఎకరాకు 3లీటర్లు అగ్ని అస్త్రం ద్రావణాన్ని పదిలీటర్లకు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రతీ రైతు ఆర్థిక స్థితిగతులను దృష్టిలో పెట్టుకుని అవలంబించాలన్నారు. కుడుపూడి జానకి, చెల్లుబోయిన రాధ, గోడి లెనిన్, కుసుమ పద్మ, ఏతవే శివరామకృష్ణ, రైతులు నాయినాల శ్రీరంగనాథం, కోలా శ్రీనివాసరావు, కుసుమ శ్రీధర్ పాల్గొన్నారు.

గణనాథుడికి ఎస్పీ పూజలు

అయినవిల్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాక ఆలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన రాహుల్ మీనా పూజలు నిర్వహించారు. దేవస్థానం అధికారులు, అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ప్రధానార్చకులు వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. అడిషనల్ ఎస్పీ ప్రసాద్, కొత్తపేట డీఎస్పీ మురళీమోహన్, సీఐ భీమరాజు, ఎస్ఐ హరికోటిశాస్త్రి పాల్గొన్నారు.

హిందూ ధర్మ సమ్మేళనానికి న్యాయవాదులు

అమలాపురంటౌన్, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): స్వామిజీల ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే హిందూ ధర్మ సమ్మేళనానికి అమలాపురం, ముమ్మిడివరం బార్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో 69మంది న్యాయవాదులు ఆదివారం అమలాపురం జిల్లా కోర్టు వద్ద నుంచి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి అజయ్‌కుమార్, కార్యదర్శి దొమ్మేటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో తరలివెళ్లారు

'మురమళ్ళ పంటకాల్వ ఆక్రమణలు తొలగించాలి'



ఎమ్మెల్యే బుచ్చిబాబుకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఐ.పోలవరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ-గుత్తెనదీవి పంటకాల్వ ఆక్రమణలు తొలగించాలని రైతులు ఆందోళన చేపట్టారు. పంటకాల్వ ఆక్రమణలతో సాగునీరందక రైతులు ఇబ్బంది పడుతున్నారని నీటిసంఘాల ప్రతినిధులు ఆరోపించారు. మురమళ్ళ 216 జాతీయ రహదారిని అనుకుని ఉన్న దుకాణదారులు పంటకాల్వను ఆక్రమించి, కాల్వ స్వరూపాన్ని దెబ్బతీస్తున్నారన్నారు. పంటకాల్వ ఆక్రమణల వల్ల మురమళ్ళ, కొమరగిరి, ఎదురులంక, పాతయింజరం, గుత్తెనదీవి, జి.మూలపొలం తదితర గ్రామాల పంట భూములకు సాగునీరందక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. పంటకాల్వ ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబుకు ఆదివారం నీటిసంఘాల ప్రతినిధులతో కలిసి రైతులు వినతిపత్రం అందజేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో నీటిసంఘాల అధ్యక్షులు సాగి వాసురాజు, చోడిశెట్టి నాగబాబు, రాయపురెడ్డి స్వామినాయుడు, చిలుకూరి సుబ్బరాజు, సొసైటీ చైర్మన్ చిక్కాల శ్రీనివాస్ తో పాటు అధిక సంఖ్యలో రైతులు ఉన్నారు.

వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాదుకు చెందిన వి.వి.జె.నాగేంద్రరావు మురమళ్ళ వీరేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.10,116 విరాళాన్ని ఆదివారం ఆలయ సిబ్బందికి అందించారు. దాత కుటుంబ సభ్యులకు ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామి చిత్రపటం, ప్రసాదం అందించి సత్కరించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ దాతను అభినందించారు.

ఎంపీ హరీష్ పూజలు

అయినవిల్లి, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాక ఆలయానికి ఎంపీ గంటి హరీష్‌బాలయోగి ఆదివారం విచ్చేశారు. స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపించుకున్నారు. తొలుత ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రధానార్చకులు వేదాశీర్వచనంచేసి శేషవస్త్రంతో సత్కరించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సేవలో రోటరీ

మలికిపురం, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ నిరంతరం ప్రజా సేవలోనే పని చేస్తోందని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ వై. కల్యాణ్ చక్రవర్తి అన్నారు. 40ఏళ్లుగా మలికిపురం రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలు చేస్తూ ముందు వరుసలో ఉందన్నారు. గతంలో నిర్మించిన బస్ షెల్టర్‌ను ఆధునికీకరణచేసి ప్రారంభించారు. పూలే-అంబేడ్కర్ భవన్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మదర్‌థెరిస్సా నర్సింగ్ కళాశాలలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పోలియో నిర్మూలనకు, నవ సమాజ నిర్మాణానికి రోటరీ క్లబ్ పాటు పడుతుందన్నారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు గెడ్డం ఫిలిప్‌రాజు, అసిస్టెంట్ గవర్నర్ గన్నాబత్తుల సత్యవతి, బాబి, డాక్టర్ సంజయ్, వరప్రసాద్, నల్లి శివకుమార్, డాక్టర్ బందెల సంపత్, దొంగ రవిచంద్ర, అల్లూరి మధురామరాజు పాల్గొన్నారు.

మావుళ్ళమ్మ ఆలయంలో నటుడు సురేష్‌శర్మ పూజలు



సినీ నటుడు సురేష్‌శర్మను సన్మానిస్తున్న దృశ్యం

కాట్రేనికోన, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మావుళ్ళమ్మతల్లి ఆలయంలో సినీనటుడు పుష్ప సురేష్‌శర్మ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మిరాయ్ చిత్రంలో తనకు అవకాశం కల్పించిన పీపుల్స్ మీడియా నిర్మాతలకు, దర్శకుడికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మావుళ్ళమ్మ ఆలయం వద్ద భజనలు, నాటకాలు వేసిన తనకు అమ్మ ఆశీస్సులతో నటుడిగా పుష్ప సినీరంగంలో గుర్తింపునిస్తే, మిరాయ్ సినిమా మరింత పేరు తెచ్చిందని సురేష్‌శర్మ అన్నారు. ఇప్పటివరకు 200పైగా టీవీ సీరియల్స్, 150చిత్రాల్లో తనకు నటుడిగా అవకాశం దొరికిందన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఆణివిళ్ళ ఫణికాంత్ పూజలు నిర్వహించి వేదఆశీర్వచనం అందించారు. సురేష్‌శర్మను బ్రాహ్మణ సంఘనాయకులతో పాటు డీసీసీ అధికార ప్రతినిధి కంచుస్తంభం సోనీ, మంత్రిప్రగడ శ్రీనివాస్, తాతపూడి గోపి, ఆణివిళ్ళ ఫణికాంత్, శంకర్ దేవాని, ఈశ్వర్, రవివర్మ, రామకృష్ణపరమహంస, పవన్, తంబి సన్మానించారు.

ఎస్పీని కలిసిన డీఎస్పీ

కొత్తపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన రాహుల్‌మీనాను కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ కలుసుకుని అభినందనలు తెలిపారు.

సరైన సమయంలో సరైన నిర్ణయం: మల్లాడి

- మల్లాడి కొత్త పార్టీపై చర్చ



మాట్లాడుతున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): యానాం ప్రజల అభీష్టం మేరకు సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటానని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. మల్లాడి అభిమాన సంఘ ఆధ్వర్యంలో మల్లాడి దంపతుల 42వ వివాహ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించేందుకు ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో అభిమాన సంఘ ప్రతినిధులు పెండెం సూర్యప్రకాష్, మల్లాడి శామ్యూల్, గిడ్ల చంద్రరావు, శేరు కృష్ణ, కాపగంటి ఉమాశంకర్, గూటం శివగణేష్, మల్లాడి సత్తిబాబు మాట్లాడారు. మల్లాడి దంపతుల వివాహ మహోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమం ముగింపులో పుదుచ్చేరి నుంచి వచ్చిన ఢిల్లీ ప్రతినిధి మల్లాడి పాల్గొని మాట్లాడారు. పది రోజులుగా యానానికి సంబంధించిన పలు పెండింగ్ అంశాలపై గవర్నర్‌తో చర్చించి పలు అంశాలు క్లియర్ చేయించినట్టు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో పుదుచ్చేరిలో మల్లాడి నూతన పార్టీ పెడుతున్నట్టు వస్తున్న వార్తలపై మల్లాడి వివరణ ఇచ్చారు. యానాం ప్రజల అభీష్టం, అభిమానుల నిర్ణయం మేరకు సరైన సయయంలో సరైన నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. పుదుచ్చేరిలో రానున్న రోజుల్లో రాజకీయంగా అనేక మార్పులు చోటుచేసుకుంటాయన్నారు. ఎన్నికలు జరిగే సయయానికి ఎవరు ఏ రాజకీయ పార్టీలో ఉంటారో తెలియని పరిస్థితి ఉంటుందన్నారు. రానున్న రోజుల్లో మల్లాడితో నలుగురు ఎమ్మెల్యేలు ఉన్నారనే పందాలో పుదుచ్చేరిలో రాజకీయం కొనసాగుతుందన్నారు. రానున్న ఎన్నికల సమ యానికి అభిమానులు, నాయకులు, కార్యకర్తలతో చర్చించిన తర్వాతే తగిన నిర్ణయం తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో నాయ కులు శేరు కృష్ణ, దంగేటి త్రిమూర్తులు, మల్లాడి భీరస్వామి, లంక వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ సైక్లోథాన్

అమలాపురం రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన జీవనానికి సైక్లింగ్ ఎంతో దోహద పడుతుందని సీనియర్ వాకర్ పచ్చిగోళ్ల రాధాకృష్ణ పేర్కొన్నారు. అందరూ ఆరోగ్యంగా జీవించేందుకు శారీరక శ్రమ, నడక, యోగాతో పాటు సైక్లింగ్ కూడా ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. సైక్లింగ్‌తో కలిగే ప్రయోజనాలు వివరిస్తూ ఆదివారం అమలాపురం నుంచి అల్లవరం మండలం గుండెపూడి సెంటర్ వరకు 20కిలోమీటర్ల మేర సైక్లోథాన్ నిర్వహించారు. రాధాకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు టీవీఎస్ రాజు, శ్రీకాంత్, త్రిమూర్తులు, ఎం.శ్రీనివాస్, కె.వెంకటేష్, ఎ.అనిరుథ్, వైఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు. సైక్లోథాన్ విజేతలకు బహుమతులు అందజేశారు.


కోదండ రామాలయంలో వార్షిక పూజలు

అల్లవరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): గోడి కట్టావారిపాలెం కోదండ రామాలయంలో ఆదివారం వార్షికోత్సవ పూజలు ఘనంగా జరిగాయి. కట్టా నరసింహారావు దంపతుల ఆధ్వర్యంలో పురోహితులు సాయి, గోపీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కుక్కల అర్జునరావు, గోడి సర్పంచ్ తోట శ్రీదేవి, తోట నరసింహారావు, దొమ్మేటి ముత్యాలరావు, కడలి ప్రసాద్, కుక్కల అనంతరావు, తోట నాగేశ్వరరావు తదితరులు పూజల్లో పాల్గొని సీతారాములను దర్శించుకున్నారు.

కొండలరావుకు నివాళి

అల్లవరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కొమరగిరిపట్నానికి చెందిన శతాధిక వృద్ధుడు గుర్రం కొండలరావు మృతికి ఎంపీపీ, పలువురు ప్రగాఢ సంతాపం తెలిపారు. కొండలరావు చిత్రపటానికి ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు, కొనుకు బాపూజీ, సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పితృ వియోగంతో బాధపడుతున్న బాబ్జికి సానుభూతి తెలిపారు.

రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నరేంద్రరెడ్డి



అమలాపురం టౌన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరిగిన ఆర్ఎస్‌యూ రాష్ట్ర మహాసభల్లో అమలాపురం పట్టణానికి చెందిన కంటేపల్లి నరేంద్రరెడ్డిని రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి ఆదివారం ప్రకటించారు. విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న నరేంద్రరెడ్డిని పలువురు అభినందించారు.

తెలుగు భాషను పరిపుష్టం చేయండి

అంబాజీపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): తెలుగు భాషను పరిపుష్టం చేయాల్సిన బాధ్యత భాషోపాధ్యాయులపై ఉందని ప్రముఖ పద్యకవి, విశ్రాంత ఉపాధ్యాయుడు పచ్చిమాల శివనాగరాజు అన్నారు. అంబాజీపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందిన తెలుగు భాషోపాధ్యయులకు దళిత తెలుగు పండితుల సమూహం తరపున సత్కార సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏ భాషకు లేని ప్రత్యేకత తెలుగుభాషకు ఉందన్నారు. పద్యం తెలుగువారి సొత్తని పేర్కొన్నారు. రాష్ట్ర, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు పొందిన జి.ప్రభావతిని, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందిన డాక్టర్ పుణ్యమంతుల అర్జునరావు, మట్టా నాగరాజులను దళిత తెలుగు పండితుల సమూహం, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పక్షాన ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లాలో వివిధ మండలాల్లో పనిచేస్తున్న తెలుగు భాషా పండితులు పాల్గొన్నారు.

'టూరిజాన్ని ప్రైవేటుపరం చేయడం సరికాదు'

మలికిపురం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): లాభాల్లో నడుస్తున్న ఏపీ టూరిజాన్ని ప్రైవేటు పరం చేయడం సరికాదని సీపీఐ జిల్లా కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ అన్నారు. ప్రభుత్వ నిధులతో రాష్ట్రంలో భూములు కొని పెట్టుబడులు పెట్టి అభివృద్ధిచేసి అనేకమందికి ఉపాధి కల్పించిన 22 రిసార్ట్‌ను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడం దారుణమన్నారు. పర్యాటకం అభివృద్ధి కోసం ప్రజలు తక్కువ రేటు భూములు ఇచ్చారని, గత ప్రభుత్వాలు ఎంతో అభివృద్ధి చేసిన తరువాత కూటమి ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు 33ఏళ్లకు లీజు పేరుతో కట్టబెట్టడం దారుణమన్నారు. వీటిలో ఉద్యోగాలు చేస్తున్న వారికి భద్రత కరువవుతుందని, 25ఏళ్లనుంచి ఇందులో ఎందరో ఉద్యోగాలు చేస్తున్నారని, ప్రైవేటు పరంచేసే ఆలోచనను విడనాడాలని ఆయన కోరారు.

శివాలయ పునర్నిర్మాణానికి విరాళాలు

అంతర్వేది, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం మోరి శ్రీపార్వతీ సీతారామలింగేశ్వర స్వామివారి దేవాలయ పునర్నిర్మాణానికి ఎన్నారై డాక్టర్ వలవల గంగాధర్, డాక్టర్ సునీతలు వారి తాతయ్య వలవల గంగరాజు జ్ఞాపకార్థం రూ.1,00,116 విరాళం అందించారు. అలాగే వలవల రామారావు జ్ఞాపకార్థం మనుమడు శ్రీరామ్‌కార్తీక్ రూ.1,08,000, వలవల కృష్ణమూర్తి జ్ఞాపకార్థం మనుమడు రోహన్ రూ.25వేలు విరాళాలుగా అందించారు. మోరిపోడు గ్రామానికి చెందిన వీరు ఆస్ట్రేలియాలో ఉంటున్నారు. బ్యాంకు అకౌంట్‌కు నగదు ట్రాన్స్‌ఫర్ చేసినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఈసందర్భంగా దాతలను పలువురు అభినందించారు.

తెలుగు కవి దేవరకొండకు పురస్కారం

రాజోలు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాయలసీమ రంగస్థలి 35వ వార్షికోత్సవ శ్రీకృష్ణదేవరాయ కల్యాణోత్సవాలు పురస్కరించుకుని ఈనెల12న తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో రాజోలుకు చెందిన ప్రముఖ కవి దేవరకొండ శ్రీనివాసవెంకటరమణారావుకు కవన గీస్పతి పురస్కారం అందజేశారు. ఆయన శివకోడు ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడిగా పని చేస్తోన్నారు. ఈసందర్భంగా దేవరకొండ మాట్లాడుతూ కవితా పఠనంతో ప్రేక్షకులను రంజిపంచేసి తెలుగు సాహిత్యానికి సేవా చేసే క్రమంలో పురస్కారం అందుకోవడం ఆనందంగా ఉందన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడికి ఏఎంసీ చైర్మన్ కేతా కృతజ్ఞతలు



శ్రీనివాసరావును సత్కరించిన రాజోలు ఏఎంసీ చైర్మన్ కేతా వెంకటలక్ష్మి

రాజోలు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఆదివారం రాజోలు ఏఎంసీ చైర్మన్ కేతా వెంకటలక్ష్మి మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రాజోలు ఏఎంసీ చైర్మన్‌గా తన నియామకానికి కృషిచేసినందుకు పల్లాకు ఆమె పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువా కప్పి పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో బొక్కా పృథ్వి, బైరిశెట్టి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ అమలుచేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

మలికిపురం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రభుత్వంలో 2003లో డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన వారికి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. సీపీఎస్ అమలు తేదీ కంటే ముందే వెలువడిన నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగానికి ఎంపికయ్యామని, కొన్ని కారణాలతో ఆలస్యంగా ఉద్యోగాల్లో చేరినందున సీపీఎస్ పరిధిలో ఉన్న తమను కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులను మెమో 57ను అనుసరించి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరింపచేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో కె.శ్రీనివాస్, కె.అరుణజ్యోతి, బి.నాగేశ్వరరావు, ఎల్.గోపి, జీవీ సత్యనారాయణ, బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుడికి సన్మానం

ముమ్మిడివరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): గేదెల్లంకకు చెందిన చేనేత కార్మికుడు పీవీవీ సత్యనారాయణ ఆగస్టు 7న ఢిల్లీలో జరిగిన నేషనల్ హ్యాండ్‌లూమ్ డే సెలబ్రేషన్స్‌లో ప్రధాని నరేంద్రమోదీ సమక్షంలో కేంద్ర చేనేత మంత్రి గిరిరాజ్‌సింగ్ నుంచి సత్కారాన్ని అందుకుని ప్రశంసలు పొందారు. చేనేత కార్మికుడిగా ఉత్తమ ఉత్పత్తులు సాధించి పలు సామాజిక సేవా కార్యక్రమాలు అమలు చేసినందుకు ఆయనను సత్కరించారు. ఈనేపథ్యంలో విజయవాడ పేరమ్మ రత్తయ్య కల్యాణ మండపంలో అఖిలభారత పద్మశాలిసంఘ అధ్యక్షుడు కందకట్ల స్వామి అధ్యక్షతన జరిగిన సంఘ సర్వసభ్య సమావేశంలో సత్యనారాయణను పలువురు ఘనంగా సత్కరించారు. జిల్లా అధ్యక్షుడు జీవీ నాగేశ్వరరావు, కోనసీమ జిల్లా అధ్యక్షుడు పర్వతం సత్యనారాయణ, జాతీయ యువజన సంఘం అధ్యక్షుడు గోపి సురేష్ తదితరులు ఆయనను సన్మానించారు.

షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘ పటిష్టానికి కృషి

మామిడికుదురు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. మండలశాఖ అధ్యక్షుడిగా కారుపల్లి కల్యాణ్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా సాధనాల సత్యనారాయణ, ఆర్థిక కార్యదర్శిగా గెడ్డం బాస్కర్, సభ్యులుగా ఉండ్రు శ్రీరమణ, తోట రాజారావు, లిఖితపూడి శ్రీపాల్, తోట ప్రసాద్‌లను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ సంఘ పటిష్టానికి కృషి చేస్తామని, అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్తామన్నారు. వెనుకబడిన పిల్లలకు విద్యను అందించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బత్తుల రమేష్‌బాబు, పెయ్యల వీరభద్రరావు, భయ్యా మోహనరావు, సీహెచ్ మనోహర్‌రాజు, నేల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు హారతి అందిస్తున్న అర్చకుడు

అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ఆత్రేయపురం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నూతనంగా నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురానికి చెందిన ఉప్పులూరి గోపాలకృష్ణ మూర్తి, ఇందిరాదేవి దంపతులు రూ.లక్ష విరాళం అందజేశారు. ఆలయ సిబ్బంది దాతలకు స్వామివారి చిత్రపటం అందచేశారు. ఆలయంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు పరిశీలించారు.

కాటన్ బ్యారేజీకి పెరుగుతున్న వరద

ఆత్రేయపురం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): గోదావరికి వరద ఉధృతి మళ్లీ పెరుగుతోంది. బొబ్బర్లంక కాటన్ బ్యారేజీ వద్ద మూడవసారి గౌతమి, వశిష్ట నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. వరద పెరగడంతో ఆయా లంక ప్రాంత వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఆయా లంక గ్రామాల్లోని ఉద్యాన పంటలు వరద నీటిలో మునిగిపోయి రైతులు నష్టాల బారినపడ్డారు. మళ్లీ వరద పెరగడంతో ఆయా లంక ప్రాంతవాసుల్లో ఆందోళన నెలకొంది.



బొబ్బర్లంక కాటన్ బ్యారేజీ వద్ద ఉరకలేస్తున్న గోదావరి

స్మార్ట్ రేషన్ కార్డులతో ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతం



రేషన్ కార్డును అందజేస్తున్న సత్యం తదితరులు

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రేషన్‌కార్డులతో ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతం అవుతుందని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం అన్నారు. ఆదివారం ద్రాక్షారామలో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి అరుణ, నాటక అకాడమీ డైరెక్టరు పెంకె అన్నపూర్ణ, జనసేన నాయకుడు సంపతి సత్యనారాయణ, వార్డు సభ్యులు కె.ఏడుకొండలు, కర్రా నాగేశ్వరరావు, అల్లం రామకృష్ణ, ఆళ్ల బుజ్జి, కోళ్ల శ్రీనివాస్, ఎ.కొండలరావు, జగతా రమణ, కార్యదర్శి పెట్టా సత్యనారాయణ, వెంకట్, వీఆర్వో పరంజ్యోతి, చౌకధరల దుకాణం డీలర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మండపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమాన్ని అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ముందుంటుందని పలువురు కూటమి నేతలన్నారు. ద్వారపూడిలోని డ్రైవర్‌కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సీసీడ్రైన్ పనులను ఆది వారం టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు యరగతపు బాబ్జి, సత్తి సత్య నారాయణ, జనసేన గ్రామ కమిటీ అధ్యక్షుడు చింతా దొరబాబుతోపాటు పలువురు కూటమి నాయకులు పరిశీలించారు. వీటి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేయాలని వారు కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సిరిపురపు సూరిబాబు, వర్రే వీరబాబు, పోకల నాగేశ్వరరావు, తాణింకి శేఖర్, యరగపు గణేష్, పులి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



డ్రైవర్ కాలనీలో డ్రైన్ పనులను పరిశీలిస్తున్న కూటమి నాయకులు

సేవా పక్షోత్సవాలను విజయవంతం చేయండి

కె.గంగవరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోడీ పుట్టిన రోజును పురస్కరించుకుని ఈనెల 17 నుంచి అక్టోబరు 2 వరకు నిర్వహిస్తున్న సేవా పక్షోత్సవాలను విజయవంతం చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు కొప్పిశెట్టి చంద్రరావు అన్నారు. ఆదివారం ఆయన అముజూరు గ్రామంలో పార్టీ నాయకులతో సమావేశం జరిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కన్వీనర్‌గా అవసరాల నారాయణమూర్తి, కో కన్వీనర్‌గా సలాది రామకృష్ణతో పాటు తాను వ్యవహరించనున్నట్టు తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా సేవాపక్వాడ్ జిల్లా కన్వీనర్ సలాది వీరబాబు హాజరయ్యారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గుర్రాల సత్యనారాయణ, ఏవీ రమణమూర్తి, కౌవులూరి వెంకటకృష్ణ, సలాది శేఖర్, నున్న సత్యనారాయణ, వీర్రాజు, వాసంశెట్టి గోవింద్, పిల్లి కిరణ్, తాళ్ల ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.



అముజూరులో సమావేశమైన బీజేపీ నాయకులు

హిందీ భాషా దినోత్సవం

మండపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలో హిందీ భాషా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా జరిపారు. ఏడిద రోడ్డులో వున్న వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ హైస్కూల్లో జరిగిన హిందీ ఆవాస్ దినోత్సవాన్ని మహబూబ్ హిందీ అకాడమీ నిర్వాహకురాలు షేక్ షబ్బినాబేగం నేతృత్వంలో నిర్వహించగా దీనికి బీజేపీ నాయకుడు కె.సత్యనారాయణతోపాటు హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసరావు హాజరయ్యారు. విద్యార్థి దశ నుంచే హిందీ నేర్చుకోవాల్సిన ఆవశ్యకత ఉందని వక్తలన్నారు. అకాడమీ వ్యవస్థాపకురాలు హిందీ భాషాభివృద్ధికి చేస్తున్న కృషిని ప్రశంసించారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు, ఫాతిమా, షఫ్రక్‌మహబూబ్ ఉన్నిషా, విద్యార్థులు పాల్గొన్నారు.



హిందీ ఆవాస్ దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు ఉపాధ్యాయులు

దంగేరు ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కె.గంగవరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): దంగేరు ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 1970-75లో టెన్త్ చదువుకున్న వారంతా పాఠశాలలో కలుసుకున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడి ఉద్యోగాలు, వ్యాపారాలు చేసి ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్న వారే కావడం విశేషం. వారంతా పాఠశాలలో కలుసుకుని అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వారంతా కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపారు. అప్పటి గురువులు నేమాని వెంకట రామారావు, రిమ్మలపూడి సత్యనారాయణలను సన్మానించారు. కార్యక్రమంలో ఒబిళినేని సత్యనారాయణ చౌదరి, డాక్టర్ సూరిబాబు, మాజీ సర్పంచ్ రావిపాటి వెంకట గణేష్ చౌదరి, ఉపాధ్యాయులు నేదునూరి రాజు, గుణ్ణం శ్రీనివాస్ తదితరులుపాల్గొన్నారు.



దంగేరు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం



పామర్రులో పర్యటించిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్

డ్రైనేజీని బాగు చేయాలి

కె.గంగవరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పామర్రులోని ఎస్సీ కాలనీని ఆనుకుని ఉన్న మురుగు డ్రైన్‌ను తక్షణమే బాగు చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోట శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన కాలనీవాసులతో కలిసి డ్రైనేజీని పరిశీలించారు. డ్రైన్‌లో వ్యర్థాలు, చెత్తా చెదారం, పశువుల కళేబరాలతో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోందని పేర్కొన్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే కాలనీవాసుల ఆరోగ్యం చెడిపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి డ్రైనేజీని శుభ్రం చేసి కాలనీవాసుల ఆరోగ్యానికి రక్షణ కల్పించాలని ఆయన కోరారు.

నేడు గర్భిణులకు సామూహిక సీమంతాలు

రాయవరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాయవరం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ నేటి ఉదయం జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు.



వెదురుపాకలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

రాయవరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు పిలుపునిచ్చారు. ఆదివారం వెదురుపాక గ్రామంలో ఆయన సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ చెప్పమని అడిగితే చెప్పవద్దన్నారు. ఆన్‌లైన్ లింక్‌పై క్లిక్ చేయడం వల్ల జరిగే నష్టాలు తెలిపారు. ఫేక్‌లోన్ యాప్‌ల జోలికి వెళ్లవద్దని, సైబర్ నేరం జరిగితే వెంటనే 1930కి కాల్‌చేసి వివరాలు చెప్పాలని సూచించారు. సైబర్ నేరాలు ఎలా జరుగుతాయి తదితర పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొవ్వూరి చంటిరెడ్డి, కొవ్వూరి నాగిరెడ్డి, వడ్డాది చిన్నకృష్ణంరాజు, సత్తి శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి నాగిరెడ్డి, ఎం.శ్రీదేవి, ఎన్.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి వేడుకలకు శ్రీకారం

రాయవరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): లొల్ల గ్రామంలో ఈనెల 22 నుంచి ప్రారంభం కానున్న శ్రీదేవి శరన్నవరాత్రులను పురస్కరించుకుని రాటకు పూజలు చేసి శ్రీకారం చుట్టారు. ఉత్సవ నిర్వాహకుల ఆధ్వర్యంలో వినాయకపూజ, అమ్మవారికి హారతులు, అర్చనలు జరిపిన అనంతరం రాట మంచి పూజలు చేశారు. కార్యక్రమంలో భోగిళ్ల సతీష్‌కుమార్, సుంకవిల్లి గంగరాజు, చంద్రాల గన్నిరాజు, ముప్పాట కృష్ణ, వైట్ల ప్రసాద్ చాత్రాతి సూర్యచంద్ర భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రావులపాలెం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఈతకోట జాతీయ రహదారి చెంతనే ఉన్న ఒక ఫీడ్స్ కర్మాగారంలో ఇటీవల అమోనియా గ్యాస్ లీకైన సంగతి తెలిసిందే. అప్పటి ఘటనలో ప్రమాదానికి గురైన ఒకవ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన వ్యవహారంపై పోలీసులు కేసు నమోదు చేశారు. గోపాలపురానికి చెందిన షైగాపుల కొండేశ్వరరావు(47) మిషన్ ఆపరేటర్‌గా అందులో పని చేస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం విధుల్లో ఉండగా అమోనియా గ్యాస్ లీకవడంతో అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే అమలాపురంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అందించారు. ఆదివారం అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందగా అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చంటి తెలిపారు.

ప్రయోగాత్మక విద్య జీవితాంతం గుర్తుంటుంది

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రయోగాత్మకంగా నేర్చిన విద్య జీవితాంతం గుర్తుంటుందని రేవతి సైన్సు ఫౌండేషన్ అధ్యక్షుడు కె.కృష్ణసాయి అన్నారు. ఆదివారం సైన్సు సెంటర్‌లో నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్ (ఎన్ఎంఎంఎస్)కు సంబంధించి 8వ తరగతి విద్యార్థులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించారు. పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రయోగాలు చేసి చూపారు. కార్యక్రమంలో పలు విద్యా సంస్థల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.నాగేశ్వరరావు, ఎం.రామచంద్రారెడ్డి, జీవీ సత్యనారాయణ పాల్గొన్నారు. తదుపరి తరగతి ఈనెల 21న జరుగుతుందని ఆసక్తి గల విద్యార్థులు పాల్గొనవచ్చని అన్నారు.

నేటి నుంచి పశువులకు టీకాలు

కె.గంగవరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం నుంచి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయనున్నట్లు కోటిపల్లి పశువైద్యాధికారి ఎ.సంయుక్త లక్ష్మీ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ యండగండి, కోటిపల్లి, గంగవరం గ్రామాల్లో టీకాల కార్యక్రమం జరుగుతుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీసీ రోడ్డుకు తారుతో మరమ్మతులా?

• కాంట్రాక్టర్ నిర్వాకంపై స్థానికుల ఆగ్రహం • చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం • బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజల విజ్ఞప్తి

మండపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి) ఎక్కువ కాలం ఉండేలా నిర్మించాల్సిన సీసీ రోడ్డును నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల తక్కువ సమయంలో అవి ధ్వంసమవుతున్నాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. సీసీ రోడ్లను వేసే సమయంలో ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టానుసారం వాటిని నిర్మించి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయా గ్రామాల్లో కోట్లాది రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్లు నాణ్యత లోపించి తక్కువ సమయంలోనే ఛిద్రమవుతున్నట్టు పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మండలంలోని పలు పంచాయతీల్లో వేసిన సీసీరోడ్లు ఇటీవల శిథిలావస్థకు చేరాయి. అర్తమూరు- అనపర్తి మధ్య వున్న సీసీరోడ్డు పలుచోట్ల పగిలిపోయి బీటలు వారడంతో దాన్ని కప్పి పుచ్చేందుకు తారుతో మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. రోడ్ల పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



తారుతో మరమ్మతులు చేసిన దృశ్యం

గన్నమని సేవలు చిరస్మరణీయం

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం గ్రామంలో పారిశ్రామికవేత్త దివంగత గన్నమని ఆనందరావు శత జయంతిని ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎంపీ హరీష్‌మాధుర్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక గ్రంథాలయం వద్ద ఏర్పాటు చేసిన గన్నమని విగ్రహాన్ని కుటుంబీకులు ఆవిష్కరించారు. ఎంపీ నిధులతో నిర్మించనున్న, గన్నమని కుటుంబీకుల సౌజన్యంతో హిందూ శ్మశానవాటిక శిలాఫలకాన్ని ఎంపీ హరీష్ ప్రారంభించారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే పల్లా, ఎంపీ హరీష్, ఎమ్మెల్యే వేగుళ్ళ, పొలిట్ బ్యూరో సభ్యుడు సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. స్థానిక సీహెచ్‌సీలో 2డి, ఎకో, థైరాయిడ్ మిషన్, ఇతర పరికరాలను వారు ప్రారంభించారు. అనంతరం గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆయన వారసత్వాన్ని అందుకున్న కుమారులు మోహనరావు, మురళీకృష్ణ తన తండ్రి బాటలో నడుస్తూ గ్రామాభివృద్ధికి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గన్నమని కుటుంబీకులు, పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రముఖులు, పలు గ్రామాల ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు.

శత జయంతి వేడుకల్లో ప్రజా ప్రతినిధులు



కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా, ఎంపీ హరీష్, ఎమ్మెల్యే వేగుళ్ల

కొత్తపేటలో ఉచిత న్యూరో, ఐ మెడికల్ క్యాంప్

కొత్తపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కొత్తపేటలోని సందీప్ ఐ క్లీనిక్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఉచిత న్యూరో, ఐ మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. దీన్ని టీడీపీ యువ నాయకుడు, ఎమ్మెల్యే సత్యానందరావు తనయుడు సంజీవ్ ప్రారంభించారు. రాజమహేంద్రవరానికి చెందిన సిటీ న్యూరో కేర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఎస్కే బాలపరమేశ్వరరావు రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అదే విధంగా సందీప్ ఐ క్లీనిక్ ద్వారా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ బండారు చిట్టిబాబు, సర్పంచ్ బూసి జయలక్ష్మి, కంఠంశెట్టి శ్రీనివాస్, బండారు బుల్లితాత, బండారు వీరబాబు, పప్పుల బుజ్జి, బి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ఉచిత న్యూరో శిబిరాన్ని ప్రారంభిస్తున్న యువ నాయకుడు సంజీవ్

అయినవిల్లి ఆలయంలో ఎస్పీ పూజలు

అయినవిల్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాక ఆలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన రాహుల్ మీనా పూజలు నిర్వహించారు. దేవస్థానం అధికారులు, అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ప్రధానార్చకులు వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. అడిషనల్ ఎస్పీ ప్రసాద్, కొత్తపేట డీఎస్పీ మురళీమోహన్, సీఐ భీమరాజు, ఎస్ఐ హరికోటిశాస్త్రి పాల్గొన్నారు.



ఆలమూరు ప్రభుత్వ కార్యాలయాలకు వేసిన సిమెంట్ రోడ్డు

ప్రభుత్వ కార్యాలయాలకు సీసీ రోడ్లు

• అధికారులు, ప్రజలు హర్షం

ఆలమూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): వర్షం పడిందంటే చాలు అక్కడి కార్యాలయాలకు వెళ్లడం చాలా ఇబ్బందికరంగా ఉండేది. ప్రభుత్వ కార్యాలయాలు దాదాపు అన్నీ ఒకేచోట ఉండటం విశేషం. ఆలమూరు తాలుకా కేంద్రంగా ఉండటంతో బ్రిటీష్ కాలంలో వాటిని ఇక్కడ నిర్మించారు. తదనంతరం మండల కేంద్రాలు ఏర్పడటం, నియోజకవర్గ కేంద్రం నియోజకవర్గ పునర్విభజనలో తొలగిపోవడంతో మండల కేంద్రంగా ఉండిపోయింది. తాలూకా కేంద్రంగా ఉన్న సమయంలో ఉన్న కొన్ని కార్యాలయాలు నేటికీ ఇక్కడనే కొనసాగుతున్నాయి. దీంతో దాదాపు పది కార్యాలయాలు ఒకే కాంపౌండ్‌లో ఉన్నాయి. పాత భవనంలో రెవెన్యూ, సబ్‌రిజిస్టార్ కార్యాలయాలు మాత్రమే ఉండగా మిగిలిన కార్యాలయాలకు అదే కాంపౌండ్‌లో సొంత భవనాలు నిర్మించుకున్నాయి. ఈ కార్యాలయాలకు గ్రావెల్ రోడ్డు మాత్రమే ఉన్నాయి. దీంతో వర్షం పడిందంటే చాలు బురదగా మారిపోయి కార్యాలయాలకు వచ్చే అధికారులు, సిబ్బందితోపాటు పలు పనుల మీద వచ్చే ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా ఉంటోంది. దీంతో ఇక్కడి పరిస్థితిని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దృష్టికి స్థానిక నాయకులు, అధికారులు తీసుకెళ్లడంతో సీసీ రోడ్లు నిర్మించడానికి నిధులు మంజూరు చేయించారు. ఈ నేపథ్యంలో రూ.25 లక్షలతో రెవెన్యూ, మండల పరిషత్, సబ్‌రిజిస్టార్, వ్యవసాయ, విద్యాశాఖ, కోర్టు, డీఆర్‌డీఏ, ఉపాధి హామీ పథకం కార్యాలయాలతోపాటు సబ్‌ట్రెజరీ తదితర కార్యాలయాలకు సీసీ రోడ్లు ఏర్పాటయ్యాయి. ప్రభుత్వ కార్యాలయాలకు సీసీ రోడ్లు నిర్మించడంతో సౌకర్యవంతం ఉన్నప్పటికీ రెవెన్యూ, సబ్‌రిజిస్టార్ కార్యాలయాలకు ముంపు సమస్య వచ్చే ప్రమాదం ఉంది. సీసీ రోడ్డు నిర్మాణంతో ఈ రెండు కార్యాలయాలు పల్లంలో ఉండిపోయాయి. దీంతో అధిక వర్షం వస్తే కార్యాలయాల్లోకి వర్షం నీరు వచ్చే ప్రమాదం ఉందని దీన్ని పరిష్కరించాలని పలువురు సూచిస్తున్నారు.



నూకాంబిక అమ్మవారి ఆలయానికి విరాళం అందిస్తున్న దాత

నూకాంబిక ఆలయానికి విరాళం

ఆలమూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయ గోపురానికి చింతలూరుకు చెందిన మాతంశెట్టి నాగేశ్వరరావుగుప్తా, పర్వత వర్ధనమ్మ దంపతులు రూ.1,10,116 విరాళాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గన్ని వెంకట్రావు, వైట్ల శేషుబాబు, బొబ్బా మురళీకృష్ణ, లేగా లక్ష్మణరావులకు అందజేశారు. పాణంగిపల్లి గ్రామానికి చెందిన కంటే వెంకటసాయి సంపత్ రూ.5000 విరాళం అందించారు.

మహిళ మెడలో పుస్తెలతాడు అపహరణ

ద్రాక్షారామ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం కాపవరంలో ఆదివారం చైన్‌స్నాచర్ మహిళ మెడలో బంగారు పుస్తెలతాడు అపహరించాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఉన్నాయి. రంగంపేట మండలం కోటపాడుకు చెందిన దాసరి దుర్గారాణి భర్తతో ఆదివారం మోటారు సైకిల్‌పై రామచంద్రపురం మండలం ఉండూరు బయలుదేరారు. మార్గమధ్యలో బావవరం గ్రామంలో వినాయకుడి అన్నసమారాధనలో వారు భోజనం చేసి మధ్యాహ్నం 12 గంటలకు బైక్‌పై బయలుదేరారు. కాపవరం గ్రామంలో చెరువు వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి మోటారు సైకిల్‌పై గుర్తు తెలియని వ్యక్తి వచ్చి దుర్గారాణి మెడలోనున్న పుస్తెల తాడు లాక్కుని వెళ్లిపోయాడు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదనపు ఎస్ఐ ఎన్.ఎస్. భుజంగరావు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



ఎస్పీ రాహుల్‌మీనాను అభినందిస్తున్న కొత్తపేట డీఎస్పీ మురళీమోహన్

ఎస్పీని కలిసిన కొత్తపేట డీఎస్పీ

కొత్తపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన రాహుల్‌మీనాను కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ ఆదివారం కలుసుకుని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మొక్కను అందించి ఆయనకు స్వాగతం పలికారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

అంతర్వేది, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనం అనంతరం రాజమహేంద్రవరానికి చెందిన అఖండం వెంకటరమణమూర్తి, కుటుంబ సభ్యులు నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.50వేలువ విరాళం అందించారు. దాతలకు సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.